TGTEL /2018/75056

# తెలంగాణభూమి

తెలుగు దినపత్రిక




నల్గొండ | ఆగస్టు 10 సోమవారం 2026 | సంపుటి : 9 | సంచిక : 52 | పేజీలు : 4 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : కొండ నరసింహస్వామి

NALGONDA | MONDAY AUGUST 10 2026 | VOL:9 ISSUE: 52 | PAGES:4 | Rs. 4:00 | EDITOR: Konda Narasimha swamy


# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇంటికి కేసీఆర్

## పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను ఓదార్చిన కేసీఆర్

తెలంగాణ ఉద్యమ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. నల్లబెల్లిలోని పెద్ది స్వగృహానికి ఆదివారం చేరుకున్న కేసీఆర్..ముందుగా పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆ సమయంలో భావోద్వేగానికి గురైన కేసీఆర్ కంటతడి పెట్టుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ తరఫున పెద్ది కుటుంబానికి రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేశారు. ఇందులో పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున మొత్తం రూ.2 కోట్లు అందించాలని.. (మిగతా 2వ పేజీలో..)



## ఆగస్ట్ 15న తెలంగాణలో ప్రారంభించబోయే కొత్త పథకాలు ఇవే!




హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ఈసారి స్వాతంత్ర్య దినోత్సవాన్ని సంక్షేమ కార్యక్రమాల విస్తరణకు వేదికగా మార్చనుంది. ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించనున్నారు. కొత్తగా 2.25 లక్షల మందికి పింఛన్లు, 5 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, 3-4 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందించే అవకాశాలున్నాయి. గిగ్ వర్కర్లకు చట్టపరమైన రక్షణ, సనత్‌నగర్‌లో ౧×మీా ప్రారంభం, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై కీలక ప్రకటనలు వెలువడనున్నాయి. సెప్టెంబర్‌లో ఇందిరమ్మ టవర్లకు శంకుస్థాపన జరగనుంది.

## వ్యవస్థతో ప్రేమతో పోరాడండి.. విద్యార్థులకు రాహుల్ గాంధీ పిలుపు

- వ్యవస్థతో ద్వేషంతో కాదు, ప్రేమతో పోరాడాలన్న రాహుల్ గాంధీ
- దేశంలో తీవ్ర ఉద్యోగ సంక్షోభం ఉందని ఆందోళన
- సంస్థలన్నింటినీ ఒకే పార్టీ గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపణ
- రాహుల్ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లిన విద్యార్థులు
- దేశంలో 'మొహబ్బత్ కీ దుకాణ్' తెరవాలని యువతకు పిలుపు

2



## నా రాజీనామాకు కారణమదే: తొలిసారి స్పందించిన ధర్మేంద్ర ప్రధాన్

- రాజీనామాపై మౌనం వీడిన ధర్మేంద్ర ప్రధాన్
- జెన్-జీ విద్యార్థులను కొందరు తప్పుదోవ పట్టించారని ఆరోపణ
- ప్రధాన్ పై విమర్శలకు పోలీసుల లాఠీఛార్జే కారణమన్న బీజేడీ
- ముందస్తు చర్యగా 30 మంది బీజేడీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

నీట్ పేపర్ లీక్ వివాదంపై విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా



చేసిన బీజేపీ సీనియర్ నేత, సంబల్‌పూర్ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ తొలిసారిగా ఆ అంశంపై స్పందించారు. విద్యార్థులను (జెన్-జీ) (మిగతా 2వ పేజీలో..)

## ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు.. తన భద్రతా అధికారిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం

- తన భద్రతా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అభిజీత్ డిప్కే
- అతిథులను కలవకుండా ఎస్ఐ అడ్డుకుంటున్నారని ఆరోపణ
- ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దంటూ అధికారిపై ఫైర్
- అతడిని విధుల నుంచి తొలగించాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన నివాసం వద్ద భద్రతా విధుల్లో ఉన్న ఓ పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను కలిసేందుకు వచ్చే సందర్శకుల పట్ల సదరు అధికారి దురుసుగా (మిగతా 2వ పేజీలో..)



## రుద్రమదేవి నుంచి శ్రీకృష్ణదేవరాయల వరకు.. బోనాల పండుగకు వేల ఏళ్ల చరిత్ర!

- కాకతీయ రాణి రుద్రమదేవి బోనం సమర్పించినట్లు ఆధారాలు
- 1516లోనే బోనాలపై పన్ను రద్దు చేస్తూ శ్రీకృష్ణదేవరాయల శాసనం
- ప్లేగు వ్యాధి కంటే ముందే బోనాలు ఉన్నాయని రుజువు చేస్తున్న పరిశోధనలు

కుతుబ్ షాహీల కాలం నుంచీ గోల్కొండలో నిరంతరాయంగా ఉత్సవాలు (మిగతా 2వ పేజీలో..)



## ప్రధానిలా కాదు, మా సీనియర్‌లా మాట్లాడారు: ఐఐటీ గోల్డ్ మెడలిస్టులు

- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ
- ప్రధాని ప్రసంగం తమను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పిన గోల్డ్ మెడలిస్టులు

2



## ఆదివాసీలతో కలిసి డప్పు కొట్టిన చంద్రబాబు.. ఉత్సాహంగా ధింసా స్టెప్పులేసిన సీఎం

- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- గిరిజన మహిళలతో కలిసి ధింసా నృత్యం, డప్పు కొట్టి అలరించిన సీఎం
- దేశానికి ఉన్నట్టే ప్రతి పౌరుడికీ వ్యక్తిగత విజన్ ఉండాలని పిలుపు
- 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే తన సంకల్పమని స్పష్టం చేసిన చంద్రబాబు

నిబద్ధతతో పనిచేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్ఘాటన

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ వారితో మమేకమయ్యారు. డప్పు వాయిస్తూ, ధింసా నృత్యకారులతో కలిసి అడుగులు



వేస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. ఆదివారం విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన

తెలంగాణభూమి
తెలుగు దినపత్రిక

## ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు.. తన భద్రతా అధికారిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి)

ప్రవర్తిస్తున్నారని, వారిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ వెంటనే అతడిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నీట్ పేపర్ లీక్ వంటి విద్యార్థి సమస్యలపై పోరాటం ద్వారా 30 ఏళ్ల అభిజీత్ దీప్కే ప్రాచుర్యంలోకి వచ్చారు. ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఆన్‌లైన్‌లో బెదిరింపులు రావడంతో వాలుజ్ ఎంఐడీసీ ప్రాంతంలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. అయితే, మఫ్టీలో ఉన్న సురేశ్ అనే ఎస్ఐ తనను కలిసేందుకు వచ్చే వారిని లోపలికి రానీయకుండా ఆటంకం కలిగిస్తున్నారని దీప్కే ఆరోపించారు.వైరల్ అవుతున్న ఓ వీడియోలో అభిజీత్ దీప్కే సదరు ఎస్ఐని నిలదీస్తూ,"నేను రమ్మని పిలుస్తున్నప్పుడు ప్రజలను అనుమతించడానికి మీకేంటి ఇబ్బంది? ఢిల్లీ పోలీసుల్లా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? ఇప్పటివరకు ఎలాంటి సమస్యా తలెత్తలేదు, మిమ్మల్ని ఇప్పుడే మొదటిసారి చూస్తున్నాను. నేను ఎవరిని కలవాలి, ఎవరిని కలవకూడదు అనేది మీరు నిర్ణయించలేరు. దయచేసి ఇక్కడి నుంచి వెళ్ళిపోండి, మీరు నా ఇంట్లో ఉండాల్సిన అవసరం లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. మరో వీడియోలో ఆయన ఓ ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడుతూ, "సురేశ్ అనే ఎస్ఐ ఇక్కడ చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నారా? ఆయన నాకు వద్దు, వెంటనే ఇక్కడి నుంచి తొలగించండి" అని కోరారు.అంతేకాకుండా, రాష్ట్ర సీఐడీకి చెందిన సిబ్బంది మఫ్టీలో తన ఇంటి పరిసరాల్లో ఉంటూ 'హిట్ స్ప్రే' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నారని దీప్కే ఆరోపించారు. ఓ విలేకరి ఒక అధికారి ఫోన్‌లో ఈ గ్రూప్‌ను గమనించారని ఆయన పేర్కొన్నారు.

## ప్రధానిలా కాదు, మా సీనియర్‌లా మాట్లాడారు: ఐఐటీ గోల్డ్ మెడలిస్టులు

శనివారం జరిగిన ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంపై గోల్డ్ మెడల్ విజేతలు ప్రశంసలు కురిపించారు. ఆయన తమతో ఒక దేశ ప్రధానిలా కాకుండా, తమ క్యాంపస్‌కు చెందిన ఒక సీనియర్‌లా మాట్లాడటం తమను ఎంతగానో ఆకట్టుకుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోదీ, పట్టాలు అందుకున్న విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు కేవలం డిగ్రీలను మాత్రమే కాకుండా, దేశ సేవ చేయాలనే లక్ష్యాన్ని కూడా తమతో పాటు తీసుకెళ్తున్నారని ఆయన ఆకాంక్షించారు. ఈ స్నాతకోత్సవంలో 587 మంది పీహెచ్‌డీ స్కాలర్‌లతో సహా మొత్తం 3,000 మందికి పైగా విద్యార్థులు తమ పట్టాలను అందుకున్నారు.'పర్ఫెక్ట్ టెన్' గోల్డ్ మెడల్ గ్రహీత అమర్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. "ఆయన ప్రసంగించిన తీరు మాతో పూర్తిగా కనెక్ట్ అయ్యింది. మేం మా ప్రధాని ప్రసంగాన్ని వింటున్నట్లు కాకుండా, ఒక సీనియర్ మాతో మాట్లాడుతున్నట్లుగా అనిపించింది" అని పేర్కొన్నారు. మరో గోల్డ్ మెడలిస్ట్ అక్షత్ సింఘాల్ మాట్లాడుతూ.. క్యాంపస్‌లోని 'నైట్ మెస్', జియా సరాయ్‌లో పోహా తినడం వంటి చిన్న అంశాల గురించి కూడా ప్రధానికి తెలియడం తమకు ఆశ్చర్యం కలిగించిందని చెప్పారు.బయోమెడికల్ ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన రామిరెడ్డి వెంకట సాయి రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "హాస్టల్‌లో తెల్లవారుజామున 3 గంటలకు జరిగే విషయాలను సైతం ప్రధాని ప్రస్తావించారు. ఇంతటి ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి మా క్యాంపస్ జీవితంలోని చిన్నచిన్న క్షణాలను గుర్తుంచుకోవడం మాకు ఎంతో సంతోషాన్నిచ్చింది" అని వివరించారు.

## రుద్రమదేవి నుంచి శ్రీకృష్ణదేవరాయల వరకు.. బోనాల పండుగకు వేల ఏళ్ల చరిత్ర!

మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ చరిత్ర నిన్నమొన్నటిది కాదని, దానికి వేల ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం ఉందని చారిత్రక ఆధారాలు వెల్లడిస్తున్నాయి. 1816లో హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి సోకినప్పుడు అమ్మవారిని శాంతింపజేయడానికి ఈ పండుగ మొదలైందని చాలామంది భావిస్తారు. కానీ, అంతకు కొన్ని వేల సంవత్సరాల ముందు నుంచే తెలంగాణ గడ్డపై ఈ సంప్రదాయం ఉందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.చరిత్ర పరిశోధకుడు డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ ప్రకారం, సుమారు 3 వేల ఏళ్ల కిందటే ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించే ఆచారం ఉంది. దీనికి నిదర్శనంగా కామారెడ్డి జిల్లా మరంద్రాళ్ల తండా సమీపంలోని రాతి గుట్టల్లో స్త్రీలు నెత్తిన బోనం ఎత్తుకున్న శిల్పాలు కనుగొన్నారు. అంతేకాకుండా, సుమారు 1600 ఏళ్ల కిందటి విష్ణుకుండినుల కాలం నాటి 'గర్భాపాత్ర' కూడా మేడ్చల్ జిల్లా కీసరగుట్ట వద్ద లభించింది.కాకతీయుల పాలనలోనూ బోనాలు వైభవంగా జరిగాయి. కాకతీయ రాణి రుద్రమదేవి తన కుమార్తె ముమ్మడమ్మకు సంతానం కలగాలని మొగిలిచర్లలోని ఏకవీరాదేవికి బోనం సమర్పించినట్లు ఏకామ్రనాథుడి 'ప్రతాప చరిత్ర' గ్రంథంలో ఉంది. పండితారాధ్య చరిత్రలో కూడా ఈ ఉత్సవాల ప్రస్తావన కనిపిస్తుంది. బోనాల పండుగ గురించి అధికారికంగా ప్రస్తావించిన మొట్టమొదటి శిలాశాసనం శ్రీకృష్ణదేవరాయల కాలం నాటిది. క్రీ.శ. 1516 మే 4న వేయించిన ఈ శాసనం ప్రస్తుతం హైదరాబాద్‌లోని రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాలలో ఉంది. తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని గొబ్బూరులో లభించిన ఈ శాసనంలో, బోనాల పండుగ నిర్వహణ కోసం రాజ్యం నుంచి చెల్లించాల్సిన పన్నులను రద్దు చేస్తున్నట్లు స్పష్టంగా పేర్కొన్నారు. హైదరాబాద్ నిర్మాత మహమ్మద్ కులీ కుతుబ్ షా కాలంలోనూ బోనాల సంప్రదాయం కొనసాగింది. శాలిబండ గ్రామంలో బోనాలు జరుపుకుంటున్న దృశ్యాలున్న ఒక సూక్ష్మ చిత్రపటం దీనికి సాక్ష్యంగా నిలుస్తోంది. గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయంలో గత 400 ఏళ్లుగా ఆషాఢ బోనాలు నిరంతరాయంగా జరుగుతున్నాయి. ఈ ఆధారాలన్నీ పరిశీలిస్తే, 1816లో ప్లేగు వ్యాధి నిర్మూలన కోసం ప్రారంభమైందన్న వాదన కంటే ఎంతో ముందే బోనాల పండుగ తెలంగాణ జనజీవనంలో, సంస్కృతిలో భాగమైందని స్పష్టమవుతోంది.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇంటికి కేసీఆర్

మొదటి పేజీ తరువాయి)

ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం రూ.25 లక్షలను ఆమె పేరిట బ్యాంకులో జమ చేయాలని ఇప్పటికే కేసీఆర్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పెద్ది కుటుంబసభ్యులకు వాటికి సంబంధించిన పత్రాలను అందజేశారు.పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పెద్ది పిల్లల భవిష్యత్తు, చదువు, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన అంశాలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ అనంతరం జిల్లా పార్టీ ముఖ్యులు సమావేశమై ఆయన కుటుంబానికి అందించాల్సిన ఇతర సంక్షేమ కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకుంటారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.కాగా, కేసీఆర్ నల్లబెల్లికి వస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు దారిపొడవునా ఆయనకు సంఘీభావం తెలిపాయి. పలుచోట్ల కేసీఆర్ తన కాన్వాయ్‌ను ఆపి కార్యకర్తలను పలకరించి ధైర్యం చెప్పారు.

## నా రాజీనామాకు కారణమదే: తొలిసారి స్పందించిన ధర్మేంద్ర ప్రధాన్

మొదటి పేజీ తరువాయి)

తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయని, అందుకే తాను రాజీనామా చేశానని వెల్లడించారు. జులై 25న రాజీనామా చేసిన సరిగ్గా రెండు వారాల తర్వాత, భువనేశ్వర్‌లోని జీఎం యూనివర్సిటీలో విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."జెన్-జీ మన పిల్లలు. కొంతమంది వారిని తప్పుదోవ పట్టించాలని చూశారు. నాకు వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు లేవు. పదవి నాకు ముఖ్యం కాదు. అందుకే ప్రధాని నరేంద్ర మోదీని కలిసి నా రాజీనామాను ప్రతిపాదించాను" అని ప్రధాన్ వివరించారు. భారతదేశంలో ప్రతి ఏటా రెండు కోట్ల మంది పిల్లలు పుడుతున్నారని, గడిచిన పదేళ్లలో 20 కోట్ల మంది జన్మించారని, వారి ఆకాంక్షలే దేశాన్ని 'విశ్వగురువు'గా నిలబెడతాయని ఆయన అన్నారు.మరోవైపు తన ఒడిశా పర్యటన సందర్భంగా బీజేడీ కార్యకర్తలు చేపట్టిన నిరసనలపై కూడా ప్రధాన్ తీవ్రంగా స్పందించారు. ఎయిర్‌పోర్ట్ వద్ద 'ధర్మేంద్ర ప్రధాన్ గో బ్యాక్' అంటూ బీజేడీ యువజన, విద్యార్థి విభాగం కార్యకర్తలు చేసిన నిరసనలను ప్రస్తావిస్తూ మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌పై విమర్శలు గుప్పించారు. "నేనొక రైతు కొడుకుని. మీరు నన్ను వెనక్కి పొమ్మన్నా, మళ్లీ వస్తాను. నవీన్ బాబు నన్ను ఒడిశా ప్రజలకు అవమానకరమని, చెడ్డవాడినని అంటున్నారు. ఒడిశా ప్రజలు సిగ్గుతో తలదించుకునే పని నేనెప్పుడైనా చేశానా?" అని సభను ప్రశ్నించగా, 'లేదు' అంటూ పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే పని తాను ఎప్పటికీ చేయనని ఆయన స్పష్టం చేశారు.ప్రధాన్ ఈ వ్యాఖ్యలు చేసిన వేదికపై బీజేడీ ఎమ్మెల్యే ప్రసన్న ఆచార్య కూడా ఉన్నారు. బీజేడీ నిరసనల నేపథ్యంలో తాను రావాలా? వద్దా? అని ప్రసన్న ఆచార్యను సంప్రదించానని, ఆయన రమ్మని చెప్పడంతోనే వచ్చానని ప్రధాన్ పేర్కొన్నారు.ధర్మేంద్ర ప్రధాన్ విమర్శలపై బీజేడీ సంబల్‌పూర్ జిల్లా అధ్యక్షుడు రోహిత్ పూజారి బదులిచ్చారు. "ప్రధాన్‌ను ఎవరూ అప్రతిష్ఠపాలు చేయలేదు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం ద్వారా ఆయన పార్టీ, ప్రభుత్వమే ఆయన పరువు తీశాయి. పోలీసుల దౌర్జన్యాలకు నవీన్ పట్నాయక్‌ను నిందించడం ఎంతవరకు సమంజసం?" అని పూజారి ప్రశ్నించారు. ఇదిలా ఉంటే.. ప్రధాన్ పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా సుమారు 30 మంది బీజేడీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## వ్యవస్థతో ప్రేమతో పోరాడండి.. విద్యార్థులకు రాహుల్ గాంధీ పిలుపు

దేశంలోని వ్యవస్థలో మార్పు కోసం ద్వేషంతో కాకుండా ప్రేమతో పోరాడాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ యువతకు పిలుపునిచ్చారు. దేశంలో ఉద్యోగ అవకాశాలు కనుమరుగయ్యాయని, కీలక రాజ్యాంగబద్ధ సంస్థలను ఒకే పార్టీ తన గుప్పిట్లో పెట్టుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం ప్రయాగ్‌రాజ్‌లోని కేపీ గ్రౌండ్‌లో జరిగిన 'ఛాత్రోం కీ గూంజ్' (విద్యార్థుల గళం) కార్యక్రమంలో విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "ఏ విద్యార్థి హృదయంలోనూ ద్వేషం ఉండకూడదు, కేవలం ప్రేమ మాత్రమే నిండి ఉండాలి. మనం ప్రేమ, ఆప్యాయతలతోనే వ్యవస్థను ప్రక్షాళన చేయాలి" అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 'మొహబ్బత్ కీ దుకాణ్' (ప్రేమ దుకాణం) తెరవాలని యువతకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు ఎంతో కష్టపడి, వ్యయ ప్రయాసలకోర్చి చదువుకున్నా ఉద్యోగ అవకాశాలు లభించకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీఎస్టీ, నోట్ల రద్దు వంటి నిర్ణయాల ఫలితంగా 'మేడ్ ఇన్ ఇండియా' అన్నది ఎక్కడా కనిపించడం లేదని, మార్కెట్లో కేవలం చైనా, వియత్నాం ఉత్పత్తులే రాజ్యమేలుతున్నాయని విమర్శించారు.ఒకప్పుడు రూ. 150 కోట్ల నిధులు కలిగిన ఒక రాజకీయ పార్టీకి ఇప్పుడు రూ. 10,000 కోట్లకు పైగా నిధులు చేరాయని, ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారిని వైస్-ఛాన్సలర్లుగా నియమిస్తూ విశ్వవిద్యాలయాలను, ఇతర కీలక సంస్థలను తమ గుప్పిట్లోకి తీసుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను రాహుల్ దృష్టికి తీసుకెళ్లారు. అలహాబాద్ యూనివర్సిటీ లైబ్రరీ వర్షపు నీటిలో మునిగిపోతోందని, దీనిపై నిరసన వ్యక్తం చేస్తే దాడులు చేస్తూ తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఓ న్యాయశాస్త్ర విద్యార్థి ఆయనకు వివరించారు. యూపీపీఎస్సీ పరీక్షల్లో 'నార్మలైజేషన్' ప్రక్రియపై కొందరు, 2018 నుంచి ఉపాధ్యాయ నియామకాలు పూర్తి కాకపోవడంపై మరికొందరు తమ గోడును వెళ్లబోసుకున్నారు. విద్యార్థులు వివరించిన సమస్యలను ఓపికగా విన్న రాహుల్ గాంధీ, నిర్మాణాత్మక పోరాటం ద్వారానే లక్ష్యాలను సాధించవచ్చని వారికి సూచించారు.

## ఆదివాసీలతో కలిసి డప్పు కొట్టిన చంద్రబాబు.. ఉత్సాహంగా ధింసా స్టెప్పులేసిన సీఎం

మొదటి పేజీ తరువాయి)

గిరిజన మహిళలు, మంత్రి సంధ్యారాణి, ఇతర నేతలు ఘనస్వాగతం పలికారు. సంప్రదాయ ధింసా నృత్యం, డప్పు వాయిద్యాల నడుమ సీఎం వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా డప్పు చేతబట్టి వాయించి సభలో కొత్త ఉత్తేజం నింపారు.అంతకుముందు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ప్రతి పౌరుడూ దేశం, రాష్ట్రం, గ్రామం, కుటుంబం కోసం ఓ సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని ఆరాధిస్తూ, సంప్రదాయాలను కాపాడుతున్న గిరిజనులకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సాధిస్తారని కొనియాడారు. సామాన్య ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి స్థాయికి ఎదగడమే దీనికి నిదర్శనమని గుర్తుచేశారు."మన సంకల్పమే మనకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చి ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది. అబ్దుల్ కలాం, ఎన్టీఆర్, ప్రధాని మోదీ వంటి ఎందరో సామాన్యులే సంకల్ప బలంతో అసాధారణ విజయాలు సాధించారు" అని చంద్రబాబు అన్నారు. "నేను, నా దేశం, నా రాష్ట్రం అనే భావనతో ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించాలనేది నా సంకల్పం" అని స్పష్టం చేశారు. ఒక రైతు పంట పండించినా, ఒక విద్యార్థి బాగా చదివినా, ఉద్యోగి నిబద్ధతతో పనిచేసినా అదంతా దేశ నిర్మాణంలో భాగమేనని ఆయన వివరించారు. "వ్యక్తిగతంగా విజయం సాధించడం కూడా దేశ నిర్మాణంలో భాగమే. పనిచేసే ప్రతి వ్యక్తీ సమాజానికి ఆస్తి. అందరి గెలుపే దేశం గెలుపు" అని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' దార్శనికతకు అనుగుణంగా, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత విజన్‌తో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆదివాసీల హక్కుల పరిరక్షణతోనే సమగ్ర అభివృద్ధి వంతల దేవదాసు

**డుంబ్రిగుడ,ఆగస్టు 10,**

ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి వనరుల పరిరక్షణతోనే ఆదివాసీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఎంపీటీసీ వంతల దేవదాసు అన్నారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా, డుంబ్రిగుడ మండలం కిల్లోగూడ గ్రామంలో సాగరమౌళి, దింసా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీల ఆధ్వర్యంలో, సంజీవిని సంస్థ వ్యవస్థాపకులు పచారి దేవుళ్ల అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వంతల దేవదాసు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీ సమాజం తరతరాలుగా అడవులు, భూమి, జల వనరులతో పాటు ప్రకృతిని పరిరక్షిస్తూ తమ ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తోందన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులు, ఆర్థిక అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధిలో గ్రామసభలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని, ఆదివాసీల భూమి హక్కులను కాపాడాలని, అటవీ హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఆదివాసీ కుటుంబానికి చేరేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఆదివాసీ యువత విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. మహిళల ఆర్థిక సాధికారతకు మరింత ప్రోత్సాహం




అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రకృతి వైద్యం అందిస్తున్న గిరిజన మహిళలకు నిర్వాహకుల ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. "ఆదివాసీ హక్కుల పరిరక్షణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రకృతి సంరక్షణ" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని వంతల దేవదాసు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ప్రతినిధి ప్రకాష్, ఏరువాక కేంద్రం డాక్టర్ ఉమామహేష్, సంజీవిని సంస్థ వ్యవస్థాపకులు పచారి దేవుళ్లు, ప్రజాప్రతినిధులు కొర్ర సీతారాం, కొర్రయి మాజీ సర్పంచ్ కొములు, ఆదివాసీ మహిళలు, సాగరమౌళి ఎఫ్‌పీఓ, దింసా ఎఫ్‌పీఓ ప్రతినిధులు పండన్న, రాంచందర్, గ్రామస్థులు, అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జై భీమ్ జై ఆదివాసీ జై జై ఆదివాసీ.

**తిరుమలకుంట గ్రామం,కొయ్య గూడెం లో గణంగా,ఆదివాసీ దినోత్సవ వేడుకలు.**

**అశ్వారావుపేట మండలం.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామంలో గల కొయ్య గూడెం లో కొయ్య జాతికి చెందిన కొమరం భీం నుతలుచుకుంటూ,ఆదివాసీ జెండా ను వెగరవేశారు.లిజీవో నెంబర్ 03 ప్రకారం ఏజెన్సీ ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని, అందులోని ఉద్యోగ అవకాశాలని ఆదివాసీల కె కల్పించాలని.1/70 యాక్ట్ ను పకడ్బందీగా, అమలు చేసి ఆదివాసీ హక్కుల ను కాపాడాలని కోరారు. లితిరుమలకుంట గ్రామంలో ఉన్న ఆదివాసులు,తిరుమలకుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ కోర్సా రాజేష్,మరియు పొట్ట వీరభద్రం,మాడి రమేష్, మొడియం శ్రీనివాసరావు, మోడియం వీరేశ్వరరావు, మడకం ముత్యాలరావు,మాడి ముత్యాలరావు,పునేం బుర్రయ్యా,పొట్ట నాగేంద్ర, కోర్సా నాగ చెన్నారావు,కాక



వెంకట ప్రసాద్, మరియ ఆదివాసీ పెద్దలు,కాక రాంబాబు, నారం పోతయ్య, మాడి బోడయ్య, నారం లక్ష్మయ్య, కారం నాగులు,కోర్సా నాగేశ్వరరావు,ఈ కార్యక్రమంలో ఆదివాసీ మహిళలు కూడా పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపిని గద్దె దించాలి.

**సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి.**

**డిండి( గుండ్ల పల్లి) ,ఆగస్టు 09 ,**

ప్రజా చైతన్య యాత్రలో భాగంగా, సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని డిండి మండలంలో ఆదివారం పర్యటించారు.సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా డిండి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో సిపిఐ ప్రజా చైతన్య యాత్రకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు .గ్రామంలో డప్పు కళాకారుల పాటలతో ర్యాలీ నిర్వహించారు.అనంతరం బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన సభలో వెంకటరెడ్డి మాట్లాడుతూ, విపరీతంగా ధరలను పెంచి సామాన్యులు బతకలేని పరిస్థితిని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిందని, పెట్రోలు, డీజిల్ వంట గ్యాస్ ధరల పెంపు అడ్డు అదుపు లేకుండా పెంచుతున్నారని, ప్రజలపై ఏమాత్రం బిజెపి ప్రభుత్వం ప్రధాని మోడీకి చిత్తశుద్ధి లేదని ఆయన అన్నారు .విద్యా వ్యవస్థను గాడిన పెట్టలేని కేంద్ర బిజెపి సర్కార్ యువత నుండి వస్తున్న వ్యతిరేకతను తగ్గించుకోవడంలో భాగంగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ను రంగంలోకి దించిందని ,ఢిల్లీ జంతర్మంతర్ లో ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో యువతరంపై అబద్ధాలు ప్రచారం చేస్తూ విదేశీ ఫండ్స్ తోని ఈ దేశంలో పాలకవర్గాలను కూల్చే కుట్రలు చేస్తున్నారని రకరకాల వదంతులు వ్యాప్తి చేస్తూ, విద్యార్థులు దేశద్రోహులని ముద్ర వేసి, తప్పుడు ప్రచారం చేయడం జరుగుతుందని అన్నారు.కనీస వేతనాలు అందుకోలేని కార్మిక వర్గం శ్రమ దోపిడికి గురవుతుందని ,మరోపక్క ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ వచ్చిన తర్వాత లక్షల మంది ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ,మరింత నిరుద్యోగం పెంచే విధంగా బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు అనుకూల విధానాలు చేస్తుందని ఆయన విమర్శించారు.అనంతరం ప్రజా చైతన్య యాత్ర బైక్ ర్యాలీని జెండా ఊపి వెంకటరెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనుద్దీన్, డిండి ,దేవరకొండ, చందంపేట ,నేరేడు గుమ్మ, మండల పార్టీ కార్యదర్శులు కనకాచారి ,సుదర్శన్ రెడ్డి, వెంకటయ్య రామాంజనేయులు ,సర్పంచి ప్రతిమ విజయేందర్ రెడ్డి, నాయకులు ,జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటరమణ, రామస్వామి, శైలేష్, రంగారెడ్డి ,మండల కార్యవర్గ సభ్యులు ,ప్రజ సంఘాల నాయకులు నూనె వెంకటేశ్వర్లు, వెంగళయ్య, ఎనమల్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.




## జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

**డిండి గుండ్ల పల్లి ఆగష్టు 09,**

డిండి మండల కేంద్రంలో స్థానిక రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు గడ్డమీది సాయి ఆధ్వర్యంలో



యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించడం జరిగింది . ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల నాయకులు , సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆరు తడి పంటలు సాగు చేయాలి.

**రైతులు పొలాలను బీడు గా ఉంచరాదు.**

**డిండి మండల వ్యవసాయాధికారి:-- రెహానా.**

**డిండి (గుండ్ల పల్లి) ఆగష్టు 09**

డిండి మండల పరిధిలోని ఎర్రారం గ్రామంలో బీడుగా ఉన్న పంట పొలాలను మండల వ్యవసాయాధికారి రెహానా సందర్శించారు. . ఆమె ఈసందర్భంగా రైతులతో మాట్లాడారు ... రైతులకు పొలాలను బీడుగా ఉంచకుండా కంది, మినుము, పెసర



వంటి ఆరుతడి పప్పుధాన్య పంటలను సాగు చేయాలని సూచించారు. పప్పుధాన్యాల సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, నేల సారవంతత పెంపు మరియు తక్కువ నీటి వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కొంతమంది రైతులు పెసర సాగు చేసేందుకు అంగీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రారం గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వరసాల లక్ష్మయ్య , ఉపసర్పంచ్ అబ్దుల్ సమీ మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చందంపేట లో ఆర్ టీసీ బస్సు - బైకు యాక్సిడెంట్.

**ఒక వ్యక్తి మృతి.**

**చందం పేట ఆగష్టు 09,**

నల్గొండ జిల్లా చందంపేట మండలం సర్కిల్ తండా వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. వాయిల పల్లి వజ్రమ్మ భర్త ఈదయ్య వయసు :50 సంవత్సరాలు కులం: మంగలి,గ్రామం :పొగిళ్ల ఇచ్చిన దరఖాస్తు ఏమనగా తనకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె సంతానం కలరు అని తన పెద్ద కొడుకు పేరు ఆంజనేయులు, చిన్న కొడుకు శ్రీను, కుమార్తె లక్ష్మిలు కలరు. నా చిన్న కొడుకు శ్రీను వయసు : 38 సంవత్సరాలు అతడు



ఈరోజు ఉదయం తన సొంత పనిమీద మల్లెపల్లి కి పోయి, తిరిగి ఇంటికి తన పల్సర్ బైక్ నెంబర్ TS 05 F F 6232 పై వస్తుండగా గుంతల తండా, సర్కిల్ తండాలకు మధ్య గల తెల్ల పలుగు గుట్ట వద్దకు వచ్చేసరికి 11 గంటల 15 నిమిషాల సమయంలో పాత కంబాల పల్లి నుండి బయలుదేరిన ఆర్టీసీ బస్సు నెంబర్ యా 05 ౧ 0170 బస్సును నడుపుతున్న డ్రైవర్ ఎండి ఆలం తన యొక్క బస్సును అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ, తనయొక్క కొడుకు నడుపుతున్న పల్సర్ బైకుకు ఎదురుగా డీకొనగా నా కొడుకు అక్కడికక్కడే చనిపోయినాడు. బైకు కూడా డ్యామేజ్ అయినది. ఇట్టి సమయంలో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు కూడా చూసినారు. కావున పోలీసులు విచారించి బస్సు డ్రైవర్ ఎం డి ఆలం పై తగిన చర్యలు తీసుకోమని దరఖాస్తు ఇవ్వగా అట్టి దరఖాస్తు పై చందం పేట ఎస్ ఐ లోకేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు బండారి మహేష్

**అశ్వారావుపేట మండలం.**

అశ్వారావుపేట నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కొరకు ఎంతగానో కృషి చేస్తున్న అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు బండారి మహేష్. అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు బండారి మహేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ మండల వారిగా, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ కమిటీ ఏర్పాటు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం లోని కాంగ్రెస్ పార్టీ కి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నూతన కమిటీని ఏర్పాటు చేసిన అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు బండారి మహేష్ ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మండల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు తమ్మిశెట్టి పోసి బాబు,బరగడ రవి, పామర్తి మధు, దమ్మపేట కు చెందిన చిన్న చెట్టి చిట్టిబాబు,వనమాల సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణభూమి
తెలుగు దినపత్రిక

## జలధార--జలహారతిలో ఏఎస్ఆర్ జిల్లాకు హ్యాట్రిక్

**మూడు విభాగాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం**

**అల్లూరిజిల్లా పాడేరు, ఆగస్టు 10**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలధార--జలహారతి కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా సత్తా చాటింది. కార్యక్రమం అమలులో మూడు కీలక విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. అత్యధిక సంఖ్యలో పనులు చేపట్టడం, అత్యధిక నూతన నీటి నిల్వ సామర్థ్యాన్ని సృష్టించడం, అత్యధిక ఆశించిన ఫలితాలను సాధించడంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. కలెక్టర్ టి. నిశాంతి నాయకత్వంలో జిల్లా యంత్రాంగం సమన్వయం, నిరంతర పర్యవేక్షణ, క్షేత్రస్థాయి అమలుపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఈ ఘనత సాధ్యమైందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయం అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి ఫలితమన్నారు. జల సంరక్షణ, నీటి నిల్వ సామర్థ్యం పెంపు, స్థిరమైన నీటి వనరుల అభివృద్ధికి భవిష్యత్‌లోనూ ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

## బర్త్ డే నాడు మహేశ బాబు డబుల్ ట్రీట్.. కుటుంబం విషెస్, సినిమా అప్‌డేట్

సూపర్‌స్టార్ మహేశ్ బాబు నేడు తన పుట్టినరోజు జరుపుకుం టున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరిం చుకుని ఆయన అభిమా నులకు డబుల్ ట్రీట్ లభించింది. ఒకవైపు కుటుంబ సభ్యులు సోషల్ మీడియా వేదికగా ప్రేమపూర్వక శుభాకాంక్షలు తెలుపగా, మరోవైపు మహేశ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి' నుంచి ఫస్ట్ లుక్ విడుదలైంది. ఈ చిత్రంలో మహేశ్ 'రుద్ర' అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన భార్య నమ్రత శిరోద్కర్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక అందమైన ఫ్యామిలీ ఫొటోను పంచుకున్నారు. మహేశ్, పిల్లలు గౌతమ్, సితారలతో కలిసి ఉన్న ఫొటోను పోస్ట్ చేస్తూ, "హ్యాపీ బర్త్ డే వీదీ! ప్రతి రోజును ప్రత్యేకంగా మార్చినందుకు ధన్యవాదాలు. ఈ ఏడాది నీకు ప్రేమ, ఆరోగ్యం, అనంతమైన సంతోషం లభించాలని కోరుకుంటున్నాను. నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాం" అని రాసుకొచ్చారు. కుమార్తె సితార కూడా తండ్రికి ముద్దు పెడుతున్న ఫొటోను షేర్ చేస్తూ, "హ్యాపీ బర్త్ డే నాన్న. ఎప్పటికీ నా ఫేవరెట్ పర్సన్ మీరే" అని తన ప్రేమను వ్యక్తపరిచింది. మరోవైపు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'వారణాసి' చిత్రం నుంచి మేకర్స్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. వెదురు తెప్పపై ప్రశాంతంగా కూర్చున్న మహేశ్, మరో పోస్టర్‌లో అడవి మధ్యలో ప్రకృతిని చూస్తూ నిల్చున్న లుక్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. "రుద్ర అంటే కేవలం భయంకరమైనవాడు మాత్రమే కాదు" అనే క్యాప్షన్‌తో ఈ లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి 'రుద్ర' పాత్ర గురించి ఒక సుదీర్ఘమైన, ఆసక్తికరమైన నోట్‌ను పంచుకున్నారు. "రుద్ర ఒక గొప్ప ఉద్దేశ్యాన్ని నెరవేర్చడానికి పుట్టాడు. తను అడగని ఒక విధిని మోస్తున్నాడు. అతను చమత్కారి, సున్నితమైనవాడు, అదే సమయంలో భయంకరమైనవాడు. మహేష్ ఆ పాత్రకు ప్రాణం పోశాడు. భయంకరంగా ఎవరైనా నటించగలరు, కానీ భయంకరంగా, సున్నితంగా ఒకేసారి నటించడం చాలా కొద్దిమందికే సాధ్యం" అని రాజమౌళి పేర్కొన్నారు. ఆఫ్రికా షెడ్యూల్ అనుభవాలను వివరిస్తూ.. "ఈ ఫ్రేమ్స్ ఆఫ్రికా షెడ్యూల్‌లోనివి. కిలిమంజారో, మసాయ్ మారా ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నప్పుడు నేను ఆశ్చర్యపోయాను. అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని 1.43:1 ఐమాక్స్ ఫ్రేమ్‌లో కూడా బంధించలేమని కొన్ని ఉదయాలు అనిపించింది" అని రాజమౌళి తెలిపారు. మొత్తంగా పుట్టినరోజున ఫ్యామిలీ విషెస్‌తో పాటు సినిమా అప్‌డేట్ రావడంతో మహేశ్ అభిమానులు పండగ చేసుకుంటున్నారు.

## 'ఐదేళ్ల పోరాటం తర్వాత.. ఈ రోజు కథ మారింది'.. వరుణ్ విజయంపై నాగబాబు ఎమోషనల్ పోస్ట్!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సుదీర్ఘకాలం తర్వాత బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేశారు. ఆయన హీరోగా, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్-కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు' థియేటర్లలో ఘన విజయం సాధించింది. తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా రూ.10.2 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, వరుణ్ తేజ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనర్‌గా నిలిచింది. ఈ బ్లాక్‌బస్టర్ విజయంపై ఆయన తండ్రి, నటుడు నాగబాబు సోషల్ మీడియా వేదికగా తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "గత ఐదేళ్లుగా అన్నీ చూస్తూనే ఉన్నాను. నా కొడుకు ఆ నిశ్శబ్దాన్ని, బాధను, నిరాశను తనలోనే మోశాడు. అయినా ప్రయత్నాన్ని ఎప్పుడూ ఆపలేదు. తన పేరు మీద హిట్లు లేవు, కేవలం వైఫల్యాలు మాత్రమే తనని పరీక్షిస్తూ వచ్చాయి. అది తనని ఎంతగా బాధపెట్టిందో నాకు తెలుసు, కానీ ఆ బాధను ఎప్పుడూ బయటకు చెప్పలేదు" అంటూ నాగబాబు తన మనసులోని మాటలను పంచుకున్నారు. తామిద్దరం మౌనంగానే ఒకరినొకరు ఓదార్చుకునేవాళ్లమని, మాటల్లో చెప్పకుండానే ఒకరి భావాలను మరొకరు అర్థం చేసుకునేవాళ్లమని ఆయన గుర్తుచేసుకున్నారు. "ఐదేళ్ల పోరాటం తర్వాత.. ఈ రోజు కథ మారింది. ఒక బ్లాక్‌బస్టర్ విజయం దక్కింది. అయితే ఈ విజయం పూర్తిగా వాడిదే. వాడి పోరాటం, వాడి సహనం, వాడి కష్టం. నేను వాడి కెరీర్‌లో ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు, ఏ క్రెడిట్ తీసుకోలేదు. నిన్నటి వైఫల్యాలు ఎలాగో తనవేనో, ఈ రోజు ఈ విజయం కూడా పూర్తిగా తనదే" అంటూ తండ్రిగా తనకెంతో గర్వంగా ఉందని నాగబాబు పేర్కొన్నారు. "కంగ్రాట్స్ బంగారు.. నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది" అంటూ వరుణ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఈ విజయానికి కారణమైన దర్శకుడు మేర్లపాక గాంధీ, నటుడు సత్య, నటి రితికా నాయక్, నిర్మాత రాజీవ్, సంగీత దర్శకుడు తమన్‌తో పాటు చిత్ర బృందం మొత్తానికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కథను నమ్మి, అందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు.



## ఆ ప్రాబ్లమ్ వల్లే ప్రమోషన్స్‌కి రాను.. కానీ యశ్ కోసమే నా నియమం బ్రేక్ చేశా: నయనతార

దక్షిణాది చిత్ర పరిశ్రమలో లేడీ సూపర్‌స్టార్‌గా తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న నయనతార, తన సినిమాల ప్రమోషన్లకు దూరంగా ఉంటారనే విషయం అందరికీ తెలిసిందే. ప్రీ-రిలీజ్ ఈవెంట్లు, ఇంటర్వ్యూలకు ఆమె హాజరుకావడం చాలా అరుదు. అయితే, తన ఈ నియమాన్ని పక్కనపెట్టి, నిన్న జరిగిన 'టాక్సిక్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ఆమె హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. తాను ఎందుకు వచ్చానో కూడా ఈ వేదికపై ఆమె స్వయంగా వెల్లడించారు. ఈ సందర్భంగా నయనతార మాట్లాడుతూ.. "నేను ప్రమోషనల్ ఈవెంట్లకు హాజరుకాకూడదని కాదు. నాకు ఆ పని సరిగ్గా చేతకాదు. అందుకే వాటికి దూరంగా ఉంటాను. కానీ, ఈ కార్యక్రమానికి రావడానికి హీరో యశ్ ఒక్కరే కారణం. ఆయన ఒక్క ఫోన్ కాల్ చేశారు, ఈ ఈవెంట్‌కు రావడానికి నాకు అది చాలు" అని తెలిపారు. కేవలం యశ్ కోసమే తాను ఈ కార్యక్రమానికి వచ్చానని స్పష్టం చేశారు. యశ్‌తో కలిసి పనిచేసిన అనుభవం గురించి చెబుతూ.. "చాలా మంది పెద్ద స్టార్స్ ఉంటారు. కానీ, యశ్‌ను మొదటిసారి కలిసినప్పుడు, తెరపై ఆయనకున్న లార్జర్-దెన్-లైఫ్ ఇమేజ్ నిజ జీవితంలో కూడా కనిపించింది. ఆయన వ్యక్తిత్వం కూడా అంతే గొప్పది" అని ప్రశంసించారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన 'టాక్సిక్' చిత్రంలో యశ్, నయనతారతో పాటు కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి కీలక పాత్రల్లో నటించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇంగ్లీష్, కన్నడ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరించిన ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీ, మలయాళంలో డబ్ చేసి రిలీజ్ చేయనున్నారు.




## గౌరీ హెగ్డేగా టబు.. 'స్లమ్ డాగ్' నుంచి స్పెషల్ గ్లింప్స్

డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తనదైన శైలిలో మరో కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. విజయ్ సేతుపతి హీరోగా 'స్లమ్ డాగ్ - 33 టెంపుల్ రోడ్' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఓ ఇంట్రెస్టింగ్ మూవీని తెరకెక్కిస్తున్నారు. పాన్-ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా నుంచి తాజాగా ఒక కీలక అప్‌డేట్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో సీనియర్ నటి టబు ఒక శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నట్టు ప్రకటించింది. ఈ సినిమాలో టబు 'గౌరీ హెగ్డే' అనే పాత్రను పోషిస్తున్నారు. ఆమె పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తూ, "ఆమెతో పెట్టుకోవడానికి సాహసించవద్దు" (రాష్ట్రవ'ం అశ్రేష్ట్రవ శీఅవ ఎశీబ ఝతీవ్ శీ ఎవంం షఉష్ట్ర) అనే క్యాప్షన్‌ను జోడించారు. దీన్ని బట్టి సినిమాలో ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండనుందో అర్థం చేసుకోవచ్చు. గౌరీ హెగ్డే పాత్రకు సంబంధించిన ఒక స్పెషల్ క్యారెక్టర్ గ్లింప్స్‌ను రేపు (ఆగస్టు 10) ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్, జేబీ మోషన్ పిక్చర్స్ బ్యానర్లపై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్, జేబీ నారాయణ రావు కొండ్రోళ్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విజయ్ సేతుపతి సరసన సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బ్రహ్మాజీ, విష్ణు రెడ్డి తదితరులు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ సినిమాపై పూరి, విజయ్ సేతుపతి, టబు కాంబినేషన్ కారణంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed,Published and Owned by : **Konda Narasimha swamy** PRINTED AT **: KOUSAYA PRINTERS ,** H.NO 6-1-948 BOYAWADA STREET, DIST: NALGONGA TELANGANA 508001. RNI NO - **TGTEL/2018/75056.** CELL NO : 7989870511.